# హేండ్ బేగ్

''పేసింజర్స్ బౌండ్ టు కాట్మండ్ బై రాయల్ నేపాల్ ఎయిర్ లైన్స్ ఫ్లయిట్ టూనాట్ సిక్స్....'' అన్న ఎనౌన్స్‌మెంట్ వినగానే బిలబిలమంటూ బ్రీఫ్‌కేస్‌లూ, హేండ్‌బేగ్‌లూ చేతుల్లో పుచ్చుకుని లేచేం. పద్దెనమండుగురం అంటే తొమ్మండుగురు దంపతులం. అంతా మధ్య వయస్కులం, అందరిలోనూ నేనూ మా ఆవిడా వయస్సులో పెద్దవాళ్ళం.

విండో సీట్‌లో కూర్చుంటే హిమాలయ శిఖరాలు తళతళ మెరుస్తూ కన బడతాయని మేము ఢిల్లీ వొచ్చేక అక్కడి స్నేహితులు చెప్పేరు. ఎయిర్ బస్ ఎక్కామో లేదో మాకు రిజర్వయిన సీట్లలో విండో సీట్లకోసం ఆడాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ వెళ్ళి సర్దుకున్నారు. ఈ గందరగోళం అంతా వింతగా చూస్తూ నిలబడ్డ ఎయిర్‌హోస్టెస్‌కి సంగతి చెప్పగానే నవ్వుకుని, వెనకవరసల్లో ఖాళీగా వున్న విండోసీట్లు చూపెట్టింది.

మా సీట్లు 'నో స్మోకింగ్' లౌంజ్‌లూ వున్నాయి. బ్రేక్‌ఫాస్టు ట్రేలు తీసుకుపోయిం తర్వాత, సిగరెట్ కాల్చుకోటానికి నేనూ గుర్నాథం, రాజు లేచి వెనక సీట్లువైపుకు వెళ్ళేం.

మా గ్రూపుకు లీడర్ రాజు. ఈ మధ్యనే సతీసమేతంగా స్టేట్స్ వెళ్ళి వొచ్చేడు. అతని భావాలకీ, మాటలకీ, చేష్టలకీ ముందు ఓ పరదా వుంటుంది. అది అమాయకత్వమో, వేళాకోళమో, మొండితనమో తెలుసుకోడం కష్టం. అతని ధోరణి చూసినవాళ్ళు స్టేట్స్ మాట అటుంచి భీమవరం దాటి విజయవాడైనా వెళ్ళేడా అనుకుంటారు.

మేము సిగరెట్లు వెలిగించేముందు ఓ పాశ్చాత్య యువతి కూర్చున్న సీటు పక్కనే ఓ సీటు ఖాళీగా వుండటంచూసి ''అలా కూర్చోండి'' అని రాజుతో గుర్నాథం అన్నాడు.

''అలాంటి అమర్యాద పనులు చెయ్యకూడదు'' అన్నాడు రాజు.

''ఇందులో అమర్యాదేముంది?....'' అంటూ గుర్నాథం ఉపన్యాసం మొదలెట్టేడు. నేనా అమ్మాయి దగ్గరికెళ్ళి ఆ సీట్లో ఎవరేనా వున్నారా అడి అడిగేను. 'లేరు, కూర్చోవచ్చు' అంది. కూర్చున్నాను.

ముప్ఫయి సంవత్సరాలలోపు వయస్సుంటుంది. గోల్డెన్ కలర్ బాబ్డ్ హెయిర్. జుట్టు చెదిరిపోకుండా వెనక వైపు అర్ధచంద్రాకారంలో వున్న ఆర్నమెంటల్ క్లిప్ పెట్టుకుంది. 'రెవెడర్' ఫ్రెంచ్ పెర్‌ఫ్యూమ్ గుప్పుమంటుంది. నీలిరంగు కళ్ళు. చక్కని కోలమొహం. గులాబిరంగులో వల్చని పెదవులు, ఛార్మింగ్ ఫిగర్. ఆలివ్‌గ్రీన్‌మీద రెడ్ ఫ్లోరల్ డిజైన్ వున్న డబుల్‌పీస్ డ్రెస్. గ్రే అండ్ వైట్ కలర్ కాంబినేషన్‌లో వున్న మింక్ బొత్తాములు పెట్టుకోకుండా తొడుక్కుంది. దాని అడుగున లోనెక్ స్క్వేర్‌కట్ బ్లవుజ్‌లోంచి ఆమె యవ్వన బింకం తొంగి చూస్తుంది.

''ఏమిటిందాక అక్కడ లేడీస్ గొడవపడ్డారు?'' అని అడిగింది, టిపికల్ నార్తమెరికన్ ఏక్సెంట్‌లో. సంగతంతా చెప్పేను ఎక్కణ్ణుంచి వొస్తున్నారని అడిగింది. హైదరాబాద్ నుంచి కాన్ఫరెన్స్ వుంటే ఢిల్లీ వొచ్చేమని, కాట్మండ్ వెడదామన్న వుద్దేశ్యంతో ఫేమిలీస్‌తో వొచ్చేమని చెప్పేను. అదే సమయానికి పానకంలో పుడకలాగ రాజు వొచ్చి-

''మీరిక్కడ కూర్చున్నారు బాగానే వుంది. మీ వైఫ్‌గారొచ్చి చూస్తే బాగుండదేమో ఆలోచించండి'' అని హెచ్చరించేడు.

''మా ఆవిడ యిక్కడికి రాదు'' అన్నాను.

''రారని గేరంటీ ఏమిటి?''

''మీ రెళ్ళి చెబితే తప్ప రాదు.''

''నా అంతకి నేను చెప్పననుకోండి. మీరేరీ అని అడిగితే చెప్పాలి కదా?''

''ఎందుకు చెప్పాలి? నాకు తెలీదని చెప్పండి.''

''అబద్ధ మెలా చెప్పమంటారు?''

''అబద్ధం చెప్పొద్దు, నిజం చెప్పొద్దు-నువ్వెళ్ళవయ్యా బాబూ!'' అన్నాను.

''వెడితే చెప్పవల్సొస్తుంది.''

''అయితే వెళ్ళొద్దు.''

"ఇలా ఎంతసేపు నిలబడమంటారు?''

''మీకు ఓపికున్నంతసేపు. లేదా నే నీవిడతో కాస్సేపు మాట్లాడేవరకు."

''ఎందుకొచ్చిన గొడవ! వొచ్చెయ్యండి పోదాం" అన్నాడు.

"నేను రాను, మీరు వెళ్ళండి" అన్నాను.

"చెప్తే వినరు కదా!" అని సణుక్కుంటూ వెళ్ళేడు.

"మీరే హోటల్లో దిగుతున్నారు?" అడిగింది, నే నందించిన సిగరెట్ తీసుకుంటూ.

"హోటల్ 'యేతి' " అన్నాను, లైటర్‌తో ఆమె సిగరెట్ వెలిగిస్తూ.

''నేనూ అక్కడే వుంటాను. పక్కనే కేసినో వుంది కదా! రోజూ సాయంత్రంపూట అక్కడే గడుపుతాను. ఫ్రీ కూపన్స్ కూడా వున్నాయి" అంది.

"మా ట్రావెల్ ఏజెంట్స్ కూడా మాకు ఫ్రీ కూపన్స్ యిచ్చేరు. అయితే, మాకు అక్కడ గేంబ్లింగ్‌లో అనుభవం లేదు. నువ్వు సాయం చెయ్యాలి'' అన్నాను.

"డబ్బు గెలవడం నేర్పలేను కాని, ఆట నేర్పుతాను'' అంది నవ్వుతూ.

''థేంక్స్ - అది చాలు. పగలల్లా ఏం చెస్తావు? మాతోబాటు కండక్టెడ్ టూర్స్‌కి రాకూడదూ?" అన్నాను నా సిగరెట్ వెలిగించుకుంటూ.

''ఇటీజ్ ఎ వేస్ట్ ఆఫ్ ప్రెషస్ టైం: నేను మీతో రాను. మీ రెక్కడి కెడతారో నాకు తెలుసు. ఈ సాయంత్రం పశుపతినాథ్ టెంపుల్, రేపు దక్షిణ్ కాళీ, ఎల్లుండి పటాన్....''

"గుడ్ హెవెన్స్! అయితే, కాట్మండ్ రావడం యిది నీకు మొదటిసారి కాదన్నమాట?'' అన్నాను.

''కాదు, యిది రెండోసారి. పగలు నా గదిలో కూర్చొని బొమ్మలేసు కుంటాను లేదా రాయల్‌గేమ్ శాంచురీకి వెళ్ళి అక్కడ ఏనుగెక్కి నెమళ్ళు, తేళ్ళు, చిరతపులులూ చూస్తాను'' అంది.

''దటీజ్ వండర్ఫుల్....సరే, సాయంత్రం కేసినోలో కల్సుకుందాం'' అని నా పేరు చెప్పి షేక్‌హేండిస్తూ లేచాను.

"అయామ్ నినా క్రేండన్, ఫ్రం డెట్రాయిట్" అంది.

సరిగ్గా అదే సమయానికి మా ఆవిడ అక్కడికొచ్చి "ఏమైపోయారో అనుకున్నాను. ఇక్కడేదో రాచకార్యం వెలగబెడుతున్నారన్నమాట!" అంటూ నినాని ఎగాదిగా చూసింది. ఆవిడ మొహంలో రంగులు మారకముందే 'నినా'ని మా ఆవిడకి అమెరికాలో పేరు ప్రఖ్యాతులున్న కమర్షియల్ ఆర్టిస్ట్‌గా పరిచయం చేసేను.

"ఊఁ....ఎవరీ నినాముండన్?" అంది తిరిగివొచ్చేక నా పక్కన కూర్చుని.

"నినాక్రేండిన్" అన్నాను.

"ఏదో వొకటి-అప్పుడే పాణిగ్రహణం చేశారు!"

"పాణిగ్రహణానికి, కరచాలనానికీ తేడా తెలియకపోతే నోరుమూసుకో" అన్నాను చూపు తీక్షణం చేస్తూ.

"నేనెంత నోరు మూసుకోపోతే మీరింత బరితెగిస్తారు? రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పదన్నట్టు - ఈవిడగారు కూడా మనం దిగే హోటల్లోనే దిగుతుందా?"

"నేను కనుక్కోలేదు" అన్నాను.

"ఉండండి, నేను కనుక్కొనొస్తాను" అంటూ లేపబోయింది.

"డోంట్ బి సిల్లీ! ఏమని అడుగుతావు?"

"వాట్ హోటల్ యువర్ రిజర్వేషన్ అని అడుగుతాను. ఆ పాటి నా యింగ్లీషు అర్థం చేసుకోగలదు!" అంది. నిజానికి అంతటి ప్రయోజకురాలే.

"అలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలతో బుర్రపాడుచేసుకోకు" అంటూ మా ఆవిడ బుజాన్ని నొక్కేక కాస్త తమాయించుకుని లేచివెళ్ళి మిగతా ఆడవాళ్ళ మధ్యకెళ్ళి కూర్చుంది.

"ఏం గురూ! పిట్ట కూతపట్టిందా, అంత సేపు కూర్చుండిపోయావు! లాంగ్ షాట్‌లో అందరూ మీకేసే చూసేరు. మీ ఆవిడ పసిగట్టినట్టుంది పిల్లిలాగా అటు వొచ్చింది. క్లోజప్‌లో పట్టుబడలేదు కదా!" అంటూ గుర్నాథం పరామర్శించేడు.

* * *

కాట్మండ్ వెళ్ళేక చలిబాధ అంటే ఏమిటో తెలిసింది. హోటల్లో గదిలో కెళ్ళేక హీటర్ అన్‌చేసి రగ్గు కప్పుకుని ఓ గంట పడుతున్నాక కాని కాళ్లూ చేతులూ స్వాధీనంలోకి రాలేదు. ఆ తర్వాత పశుపతినాథ్ టెంపుల్ కెళ్ళి తిరిగొచ్చేం.

రాత్రి అందరం కేసినోకి వెళ్ళేం. ఒకటే పెద్ద హాలు. జనంతో కిటకిట లాడిపోతుంది. ఫ్రీ కూపన్స్ తీసుకున్నాం. బ్లాక్‌జాక్, బీట్ ది డీలర్, రోలెట్టీ, పాన్‌టూన్, పావ్లూ, జాక్‌పాట్ లాంటి గేమ్స్ వున్నాయి. ఓ గంటలో ఫ్రీ కూపన్స్‌తోబాటు మరో వంద రూపాయలు సమర్పించి, చేతులు దులుపుకున్నాను. మా ఆవిడ కూపన్స్ నా కివ్వనంది. తనే ఆడుతుందిట. అదే సమయానికి విస్కీ గ్లాస్‌తో అక్కడ నినా ప్రత్యక్షమైంది. మా ఆవిడ దగ్గరకొచ్చి భుజంమీద చెయ్యి వేసి "కమాన్ లెటజ్ గో టు బ్లాక్‌జాక్" అంటూ జబ్బపట్టుకుని లాక్కెడుతుంటే మా ఆవిడ నా మొహంకేసి చూడకముందే బార్ వైపు నడిచేను. అక్కడ నా కంటే ముందరే నష్టపరిహారార్థం పుణ్యతీర్థం సేవిస్తున్న మూర్తి, శాస్త్రి, కృష్ణ, రాజు దర్శనమిచ్చేరు.

"ఎంత తైలాభిషేకం?" అంటూ శాస్త్రి పరామర్శించేడు.

"శతమానం భవతు..." అంటూ గ్లాసు అందుకుని 'చియర్స్' అన్నాను

"ఢిల్లీలో పధ్నాలుగు రూపాయలకే డాలర్లిప్పిస్తానంటే ఒకళ్ళయినా నా మాట విన్నారా? ఇక్కడే చవక, పైగా రిస్కు అంటూ నీతులు చెప్పేరు. ఇక్కడ డాలర్ రేటు ఇరవై రూపాయలుట!" అన్నాడు విచారగ్రస్తుడైన శాస్త్రి.

"ఇరవై రూపాయలా! మై గాడ్! ఢిల్లీకీ మహా అయితే ఓ రూపాయి తేడా వుంటుందన్నారు?" అన్నాను విస్తుపోయి.

"ఈ మధ్య కొకెయిన్, హాషిస్, యల్.యస్.డి. లాటి నార్కొటిక్ డ్రగ్స్‌కి కాట్మండ్ ఇంటర్నేషనల్ స్మగ్లింగ్ సెంటరయింది. బ్లాక్‌మనీ సర్కులేషన్ ఎక్కువవడం మూలాన్ని డాలర్‌కి గిరాకీ ఎక్కువై వుంటుంది. ఇవ్వాళ పేపర్లో పడింది చూడలేదూ - కస్టమ్స్‌వాళ్ళు రెయిడ్‌చేసి రెండుకోట్ల రూపాయల నార్కొటిక్ డ్రగ్స్ పట్టుకున్నారుట" అన్నాడు మూర్తి, ఏడ్చి మొత్తుకున్నా డాలర్లింతకంటే చవగ్గా దొరకవన్న ధోరణిలో.

''ఎంతయితే మాత్రం తప్పుతుందా! నాకో రెండువందల డాలర్లు కావాలి. నేను ముఖ్యంగా ఓ కార్డ్‌లెస్ టెలిఫోన్ కొనుక్కోవాలి. అదికాక చైనీస్ సిల్క్ డ్రెస్ మెటీరియర్, నేపాల్ హేండి క్రాఫ్ట్స్....''

''కార్డ్‌లెస్ ఫోన్ పట్టుకుంటే కాన్ఫిస్కేట్ చేస్తారు. ఎంత డ్యూటీ కడతామన్నా ఒప్పుకోరు.'' అన్నాడు క్రిష్ణ.

నిజానికి నేనూ ఓ కార్డ్‌లెస్ టెలిఫోన్ కొనుక్కోవా లనుకుంటున్నాను. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ ఆఫీసర్ రామ్‌ప్రసాద్ నా స్నేహితుడే ''హేండ్ బేగ్‌లో పెట్టి తెచ్చుకో. చెకింగ్ టైంలో ఆ బేగ్ మీ ఆవిడను తీసుకురమ్మను. ఇంకెవరికీ చెప్పకు'' అని సలహా యిచ్చేడు.

నినా ధర్మమా అని మా ఆవిడకి ఆ రాత్రి మూడువందల రూపాయల పై చిలుకు లాభం వొచ్చింది. ''నాది అదృష్ట జాతకమండి. మీకంత అదృష్టమే వుంటే రోజూ పేకాటలో డబ్బెందుకు తగలేసుకుంటారు? మీ కూపన్స్ కూడా నా చేతికివ్వండి, నినా చెబుతుంది. నేనాడతాను. చూడండి ఎంత గెలుస్తానో!'' అంది మా ఆవిడ. శుభం అలాగే కానియ్యి అన్నాను.

మర్నాడుదయం మా రిటర్న్ టిక్కెట్లు గురించి మా ట్రావెల్ ఏజంట్ బహదూర్‌సింగ్ ఆఫీసుకెళ్ళేను. అక్కడ నినా కూర్చుని వుంది. మా ఆవిడకి కేసినోలో సాయం చేసినందుకు థేంక్స్ చెప్పేను. మా ఆవిడ చాలా సరదా అయిన మనిషని సర్టిఫికెట్ యిచ్చింది. ఇక్కడికెందుకొచ్చేవని అడిగితే తను కూడా మా ఫ్లైట్‌లోనే ఢిల్లీ రిటర్న్ అయిపోవాలనుకుంటున్నట్టు చెప్పింది. మా టికెట్లు ఓకే అయిపోయాయి. నినా టికెట్ వెయిటింగ్ లిస్ట్‌లో వుంది.

''ఏమిటింత సడన్‌గా బుద్ధి మార్చుకున్నావు?'' అని అడిగేను.

''స్టేట్స్‌నుంచి నాలుగు రోజుల్లో మా ఫ్రెండ్స్ ఢిల్లీ వొస్తున్నారు. వాళ్ళతో కలిసి పదిహేను రోజులు పోయింతర్వాత మళ్ళీ వస్తాను'' అంది.

''ఢిల్లీలో డాలర్లు ఎక్కడ ఎక్స్‌చేంజ్ చేసుకుంటావు?''

''రిజర్వ్‌బేంక్. ఏం అలా అడిగేవు?''

''చిన్న సహాయం కోరుదామని.''

''డాలర్లు కావాలా?''

''అవును. రిజర్వ్‌బేంక్ రేటు కక్కర్లేదు. డాలర్‌కి పదిహేను రూపాయల రేటిస్తాం.''

''ఆల్‌రైట్. ఎక్కువ ఇవ్వలేను. పదిహేనువందల డాలర్లివ్వ గలుగుతాను.''

''దటీజ్ ఎ గ్రేట్ హెల్ప్. ఇట్ కవర్స్ అవర్ రిక్వాయిర్‌మెంట్'' అన్నాను.

''నా దగ్గర ట్రావెలెర్స్ చెక్స్ వున్నాయి. అవి ఎన్‌కేష్‌చేసి మధ్యాహ్నం తెస్తాను. సాయంత్రం ఆరింటికి మా రూంకొస్తే యిస్తాను'' అంది.

ఈ విషయం చెప్పగానే మావాళ్ళ ఆనందం ఇంతా అంతా కాదు. నాకిన్ని డాలర్లు కావాలంటే నాకిన్ని డాలర్లు కావాలని గంతులేశారు. డ్యూటీఫ్రీ షాపుల్లో ఇంపోర్టెడ్ గూడ్స్ కొనుక్కోడానికి రూపాయలు పనికిరావు-డాలర్లుండాలి.

''ఇలా డాలర్లూ రూపాయలూ ఎక్స్‌చేంజ్ చేసుకోడం, ముఖ్యంగా ముక్కూ మొహం తెలియని మనిషితో ప్రమాదం" అన్నాడు రాజు.

"ప్రమాద మనుకుంటే యిద్దరికీ ప్రమాదమే'' అన్నాను.

"మీరెళ్ళి డబ్బిస్తారు. ఆ డబ్బు ఆవిడ పెట్లో పడేసుకుని డాలర్లివ్వక పోతే?''

"తన్ని లాక్కుంటాను."

''ఏ అల్లరేనా జరిగితే ఆడదాని మాట నమ్ముతారు. మీ మాట నమ్మరు."

''అయితే ఏమంటావయ్యా?''

''ఎందుకయినా మంచిది, మీ కూడా నేనూ వొస్తాను'' అన్నాడు రాజు-వొట్టి సందేహాల పుట్ట.

''వీల్లేదు. అది అమర్యాద. ఆ మాత్రం నమ్మకం లేకపోతే....''

''మీ మీద నమ్మకంలేక కాదు. అవిణ్ణి మరీ అంత నమ్మడం మంచిది కాదేమోనని. మన జాగ్రత్తలో మనం వుండాలి. డబ్బు విషయంలో నేను చాలా స్ట్రిక్టుగా వుంటాను.''

''స్ట్రిక్టుగా యిక్కడే వుండండి, నేవెళ్ళొస్తా'' అని బయటకు నడిచేను.

సాయంత్రం ఆరున్నరకి టంచన్‌గా డబ్బు తీసుకుని నినా గదిలోకి వెళ్ళేను. మంచంమీదున్న డ్రాయింగ్ బల్ల చూశాను. దగ్గరగా వెళ్ళి ఆ బోర్డుకి పిన్ చేసిన కాగితంమీద చిత్రించబడ్డ కళా ఖండాన్ని చూసి విస్తుపోయేను. ఖజురహో శిల్పాల తాలూకు పచ్చి శృంగార భంగిమ. ఎదురుగా స్క్రీన్‌మీద ప్రొజెక్టర్ సహాయంతో ఆ బొమ్మ ప్రదర్శితమై వుంది. డ్రాయింగ్‌బల్ల పక్కనే రకరకాల పెన్సిళ్ళూ రబ్బరు వగైరాలున్నాయి.

''డు యూ లైకిట్?'' అంది నినా, నేనా చిత్రాన్ని శల్యపరీక్ష చెయ్యడం చూసి.

''ఎక్స్‌క్విజిట్. బెటర్ దేన్ ది ఒరిజినల్'' అన్నాను, బేగ్‌లోంచి డబ్బు తీసి ఆమెకి అందిస్తూ.

ఆమె అందుకుని బిజినెస్‌లైక్‌గా లెఖ్ఖ పెట్టుకుంటూండగా, టేబుల్ మీదున్న పెద్ద కవర్లోంచి తొంగి చూస్తున్న చిత్రాలను పైకిలాగి చూశాను. అవీ ఖజురాహో శిల్పాల ప్రతిరూపాలే. ఒకమారు రూపాయిలకట్ట లెఖ్ఖ పెట్టి, మిగిలినవి లెఖ్ఖ పెట్టకుండానే బ్రీఫ్‌కేస్‌లో పడేసుకుని, అందులోవున్న కవర్ నా కందించి "పదిహేను వందల డాలర్లు - లెక్క పెట్టుకో" అంది. లెక్క పెట్టకుండానే ఆ కవర్ జేబులో పెట్టుకున్నాను.

''ఇంపోర్టెడ్ గూడ్స్‌కొని తీసుకెడితే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ క్లియరన్స్ దగ్గిర గొడవ పడతారేమో, జాగ్రత్త!'' అంది.

''ఆ భయంలేదు. అక్కడ కస్టమ్స్ ఆఫీసర్ నా ఫ్రెండే.'' అన్నాను.

''తెలివైన వాడివే! విష్ యు ఆల్ ది బెస్ట్.''

* * *

నిజంగా మా ఆవిడది అదృష్ట జాతకమే అయివుండాలి. ఆ రాత్రి నినా సాయంతో మరో నాలుగువందలు సంపాదించి కేసినోలో.

"నినా చాలా మంచి అమ్మాయండి. తనుకూడా మన ఫ్లయిట్‌లోనే తిరిగొచ్చేద్దామనుకుంటే టికట్ యింకా కన్ఫర్మ్ అవ్వలేదని ట్రావెల్ ఏజన్సీ

వాళ్ళు ఫోన్‌లో చెప్పేరుట. పాపం, కాస్త మీరెళ్ళి ప్రయత్నించకూడదూ?'' అంటూ మా ఆవిడ ఆజ్ఞాపించింది.

మర్నాడుదయం నేనూ రాజూ వెళ్ళి ఆ ట్రావెల్ ఏజంట్ జేబులో మూడు వందలు పెట్టి 'త్వమేవ శరణం మమ' అని గట్టిగా బతిమాలేము. ఓ.కే. అయినట్టు సాయంత్రం ఫోన్ వొచ్చింది. నినా తన గదిలోనే వుంది. కల్సుకుని చెప్పేను. "థేంక్యూ వెరీమచ్. .. దిస్ కాల్స్‌ఫరె సెలబ్రేషన్....కమాన్" అంటూ రెండు గ్లాసుల్లో రాయల్ శల్యూటూ అయిసూ వేసి, నా చేతికో గ్లాసిచ్చి తన గ్లాసుతో మంచంమీద నా పక్కని కూర్చుంది. ఛియర్స్ చెప్పుకున్నాం.

"పొద్దుట్నుంచీ టికట్ గురించి ఒక్కటే ఆందోళన. ఈ శుభవార్త తెచ్చి నాకు ప్రాణం పోశావు. కృతజ్ఞురాల్ని" అంది.

"ఫర్గెటిట్. నువ్వు వేసిన ఈ చిత్రాలను ఎక్కడ ప్రదర్శిస్తావు?'' అడిగేను.

''వాటికి చాలా గిరాకి వుంది. ఉండు, నీకో చిత్రం ప్రజెంట్ చేస్తాను" అంటూ లేవబోయింది. భుజంమీద చెయ్యివేసి లేవకుండా ఆపుచేశాను.

"ఒద్దు. బొమ్మలు చూసి తృప్తిపడ మంటావా? అయినా ఓ విషయం అడుగుతాను వొంటరిదానివి. మనస్సునుద్రేకపరిచే యిటువంటి చిత్రాల రచన నీ వొంటికి మంచిదికాదేమో!" అన్నాను, నా చేత్తో ఆమె నడుమును చుట్టుతూ.

"ఆ బొమ్మల్లో నేను చూసేది వాటివల్ల నాకు వొచ్చే ఆదాయం. ఇక నా వంటరితనం, ఉద్రేకం అంటావా-నా కవసరమైనప్పుడు నాకు నచ్చిన తోడు దొరక్కపోదు" అంది చిలిపికళ్ళతో నా కళ్ళల్లోకి చూస్తూ.

"అయితే, నీకిప్పుడు అవసరం లేదా? నేను నచ్చలేదా?" అని అడిగేను, ఆమె భుజాలను నా భుజాలతో ఒత్తుతూ.

"యూ నాటీ ఓల్డ్ బోయ్!" అంది నా మీదకు వాల్తూ.

* * *

సూపర్ మార్కెట్ పద్మవ్యూహంలా గుంటుంది. లోపలకెడితే దారి తెన్నూ తైమూ తెలియవు. అంచేత ఎవళ్ళు ఎంతసేపు ఎక్కడ తిరిగినా ఎనిమిదయ్యేటప్పటికి హోటల్‌కి తిరిగొచ్చి రాజు రూంలో సమావేశమవాలని తీర్మా

నించేం. నేనూ రాజూ డ్యూటీఫ్రీ షాపుకెళ్ళి చెరో కార్డ్‌లెస్ టెలిఫోనూ కొనుక్కుని తిరిగొచ్చేసేము. ఎవళ్ళకి కావల్సినవి వాళ్ళు కొనుక్కుని ప్లాస్టిక్ సంచీలతో వొచ్చేరు. మా ఆవిడ నేవీ బ్లూకలర్‌లో వెల్‌వెట్ ఫినిష్‌తో వున్న హేండ్ బేగ్ తెచ్చింది. అడుగు భాగంలో రెండు జిప్‌లాన్నాయి. ఆ జిప్‌లు తెరిస్తే ఆ బేగ్ రెట్టింపు సైజవుతుంది. బరువెక్కువయితే లాక్కెళ్ళడానికి చక్రాలు కూడా వున్నాయి. అందరూ చాలా బాగుందని మెచ్చుకున్నారు. మా ఆవిడ తెలివితేటలకీ అభిరుచికీ ఆశ్చర్యపడి మురిసిపోయి ''ఖరీదెంత?" అని అడిగేను.

"పద్దెనిమిది డాలర్లు" అంది. అంతటితో వూరుకోకుండా "అక్కడ నినా కనబడి నన్ను డ్యూటీఫ్రీ షాపుకు తీసుకెళ్ళింది. తను యిలాంటి బేగ్ కొనుక్కుని, వొద్దుమొర్రో అంటున్నా వినకుండా నా చేతకూడా ఒకటి కొనిపించింది" అంది, ఇవన్నీ నా తెలివితేటలు కాదు సుమాండీ అని విశదీకరిస్తూ. "యువర్ వైఫ్ ఈజ నైస్ ఇన్నొసెంట్ లేడీ" అని నినా ఎందుకు అందో అర్థమైంది.

*　　*　　*

మర్నాడుదయం నేనూ మా ఆవిడా సామాన్లన్నీ సర్దుకున్నాం.పదకొండు గంటలకి కాట్మండ్ నుంచి ఢిల్లీకి ఫ్లయిటూ, మళ్ళీ అక్కణ్ణుంచి సాయంత్రం ఫ్లయిట్‌లో హైదరాబాదు ప్రయాణం పెట్టుకున్నాం. రెండు డ్రైఫ్రూట్ పేకట్లు పట్టుకుని నినా ప్రత్యక్షమయింది. మా వాళ్ళందరి గదుల్లోకి తలో పేకట్టు పంపించి మా ఆవిడకి స్వయంగా యివ్వాలని వొచ్చిందిట మా ఆవిడ ఆనందంతో నినాని కౌగలించుకుని హైదరాబాదు తప్పకుండా రావాలని ఆహ్వానించింది. వస్తానని నినా వాగ్దానం చేసింది.

మాసిపోతుందని మా ఆవిడ కొత్త హేండ్‌బేగ్‌ని మరో సంచిలో కుక్కేసింది. ఆ విషయం చెప్పగానే నినా నవ్వి ఆ బేగ్ బయటికి తీయించి అందులో స్వయంగా తనేసామాన్లన్నీ నీట్‌గా సర్దింది. కార్డ్‌లెస్ టెలిఫోన్ పేకట్ కూడా అట్టుగున పెట్టింది.

ఫ్లయిట్‌లో నినా మా ఆవిడ పక్కనే కూర్చుంది. వొచ్చీరాని యింగ్లీషులో తడుముకోకుండా మా ఆవిడ చకచక మాట్లాడేస్తుంది. అది వింటూ నేనూ రాజూ వెనకసీట్లో కూర్చుని నవ్వుకుంటున్నాం, ఉదయం గదిలోకొచ్చినప్పుడు

కాని, ఎయిర్‌పోర్ట్‌లో కాని, నినా ఫ్లయిటులో కాని, నాతో మాట్లాడకపోగా నాకేసయినా చూడలేదు. బహుశా అందుకే మా ఆవిడకంత సన్నిహితురాలవ గలిగిందను కుంటాను.

ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో, అమెరికన్ సిటిజన్ కాబట్టి ఇమ్మిగ్రేషన్ కార్డుతో బాటు పాస్‌పోర్ట్‌మీద కూడా స్టాంప్ వేయించుకోవాలి కనక, నినా వెనకబడింది. కస్టమ్స్ ఎన్‌క్లోజర్‌లో రామ్‌ప్రసాద్ కనబడగానే మనస్సు స్థిమిత పడింది ముందుగా మా లీడర్ రాజు సామాన్లు తణిఖీకి ఉపక్రమిస్తూ రామ్‌ప్రసాద్ "డిక్లేర్ చేస్తే ముందు చెప్పి బయట పెట్టండి. లేకపోతే పెనాల్టీ పడుతుంది'' అన్నాడు.

"మేము పశుపతినాథ్ దర్శనానికెళ్ళిన యాత్రీకులం. మేం నేపాల్ నుంచి కొనుక్కు తెచ్చుకునే వేముంటాయి?" అంటూ పెట్టితాళం తియ్యడానికి తాళం చెవికోసం కోటుజేబులు తడుముకుంటుండే.

"మీ గ్రూప్‌లో వి.సి.ఆర్.లు ఎవరైనా కొన్నారా?" అని అడిగేడు రామ్‌ప్రసాదు.

''లేదండి! వుంటే డబుల్ పెనాల్టీ వెయ్యండి.''

''పోనీ, కార్డ్‌లెస్ టెలిఫోన్‌లు?"

''మా యింట్లో టెలిఫోనే లేదండి. అసలు ఆ కార్డులెస్ టెలిఫోనెలా వుంటుందో ఎరగను" అన్నాడు రాజు తన సూట్‌కేసు తెరిచి ప్రదర్శిస్తూ. రామ్ ప్రసాదు ఆ సూటుకేసులో చెయ్యిపెట్టి అటూయిటూ తడిమేడు. తర్వాత "ఆల్ రైట్! మీ గ్రూపువాళ్ళందరూ సామాన్లు తీసుకుని బయటకెళ్ళండి'' అన్నాడు.

బ్రతుకుజీవుడా అని అందరం మామా సూట్‌కేస్‌లూ బేగ్‌లూ పట్టుకుని బయటకొస్తున్నాం. అంతలో కెవ్వుమని మా ఆవిడ ఆర్తనాదం వినబడింది.

''ఈ హేండ్‌బాగ్ మనది కాదండి నినాది, మనది మారిపోయేయి''
అంది మా ఆవిడ బిక్కమొహం వేసుకుని.

''ఏం జరిగింది? ఏమిటి మీ గోల?'' అంటూ రామ్‌ప్రసాద్ మా దగ్గిర కొచ్చేడు. వాడి స్వరంలో కరుకుతనంవుంది కాని, సానుభూతి లేదు.

''మా బేగ్ మరొకావిడ బేగ్ ఇంటర్ ఛేంజ్ అయ్యేయి'' అన్నాను.

''ఆవిడెవరు?''

''నినా క్రేండిన్ అని, అమెరికన్ లేడీ.''

''వీళ్ళిద్దరికీ ఒకే రకం బేగ్స్ ఎలా వొచ్చేయి?"

అడిగేవాడికి చెప్పేవాడు లోకువన్నట్టు ప్రశ్నల వర్షం కురిపించేడు. ఓపిగ్గా సమాధానా లిచ్చేను. అంతా విని ''ఆల్ రైట్. మీ రిక్కడుండటానికి వీల్లేదు. బయటకెళ్ళేక ఆవిడా మీరు బేగ్స్ మార్చుకోండి. ప్లీజ్ గో అవుట్'' అన్నాడు అధికారస్వరంతో.

''అదికాదురా... ఆ బేగ్‌లో...." అంటూ నా కంగారు కారణం చెప్ప బోయేను.

''మీరు వెంటనే బయిటికి వెడతారా? పంపించమంటారా? ప్లీజ్, క్లియర్ అవుట్'' అన్నాడు కళ్ళెర్రజేసి రెచ్చిపోతూ.

అందరూ వెళ్ళి వెయిటింగ్ హాల్లో కూర్చున్నారు. నేనూ మా ఆవిడా మా సామాన్లు పట్టుకుని కస్టమ్స్ ఎన్‌క్లోజర్ బయట దూరంగా నిలబడ్డాం.

''వీడేం ఫ్రెండండీ! వీడిమొహం తగలెయ్యా! ఇంత అమర్యాదగా బయి టకి గెంటేసేడు!'' అంది మా ఆవిడ. నేను మాట్లాడలేదు.

''ఆనవాలు తెలియకపోతే నన్నడగొచ్చుకదా! ఏమిటో మీరేపనీ సజా వుగా చెయ్యరు'' అంది.

''ఈ బేగ్ నా చేతికి నినా యిచ్చింది. చూసే యిచ్చుంటదనుకున్నాను."

''ఏమిటో మీ ఫ్రెండ్ ధోరణి నాకునచ్చలేదు. పదేళ్ళ తర్వాత కల్సు కున్నామంటున్నారు చూస్తూవుండండి మీ ఫ్రెండ్ ఏంచేస్తాడో! నినా బేగ్‌లోంచి బయటపెట్టి ఆ టెలిఫోన్‌కాస్తా కాజేస్తాడు. ఏమిటో ఇది మీ జాతకఫలమను కుంటాను. ఆ రాజుగారు అంత అమాయకుడిలా కనబడుతాడు, సత్యహరిశ్చం ద్రుడిలా మొహంపెట్టి పచ్చి అబద్ధమాడి ఎంత తమాషాగా తప్పించుకొచ్చే సేడు!'' అంటూ మా ఆవిడ సణుగుడు మొదలెట్టింది. నిజానికి రామ్‌ప్రసాద్

ప్రవర్తన నాకు తలకొట్టేసినట్టయింది. నా నిస్సహాయస్థితికి నామీద నాకే జాలే సింది.

''అదుగో, నినా బయటకొచ్చింది,'' అంటూ నా చేతిలో బేగ్ తీసుకుని మా ఆవిడ నినా దగ్గరకెళ్ళి ఈ బేగ్ యిచ్చేసి ఆ బేగ్ అందుకుని కౌగలించు కుని టాటా చెప్పడం, మా ఆవిడ మొహంలో సంతోషం తాండవించడం దూరంగావుండి గమనించేక నా మనస్సు కుదుటబడింది.

నినా నావైపుకూడా చూడకుండా వెళ్ళిపోతుంటే నా హృదయంలో భద్ర పరచుకున్న ఓ ఆనందరేఖ అదృశ్యమైపోతున్నట్లు అనిపించింది. అలా ఆమె వెడుతున్నవైపే చూస్తూండగా ఎయిర్‌పోర్ట్ మెయిన్ ఎగ్జిట్ పదడుగులుంద నగా, గబగబ కస్టమ్స్ అధికార్ల బృందం ఆమెను చుట్టుముట్టింది.

* * *

''డెబ్భయి లక్షల రూపాయల విలువైన యల్.యస్.డి. పౌడరు మీ ఫ్రెండ్ నినా కేన్ డ్రిన్ బేగ్‌లో వుంది!'' అన్నాడు రామ్‌ప్రసాద్, హైదరాబాదు ఫ్లయిట్‌కి మేము రెడీ అవుతుండగా.

''అంటే - అంతవరకూ నా చేతిలోవున్న ఆవిడ హేండ్‌బేగ్‌లోనా?'' అన్నాను దిగ్భ్రమతో.

''అవును.''

''గుడ్ హెవెన్స్! నువ్వెలా అనుమానించేవు?''

''ఒకేలాంటి రెండు హేండ్‌బేగ్ లుండేలాగ నీ వైఫ్‌చేత ఒకటి కొని పించడం, మీ ఫ్లయిట్‌లోనే తిరిగి రావడం, పొరపాటులాగ కనబడేటట్టు ఆమె బేగ్ నీ చేతి కివ్వడంకంటే ఏం కారణాలు కావాలి అనుమానించడానికి? మీలాంటి హాలిడే టూరిష్టుల్ని సాధారణంగా మేం చూసీచూడనట్టు వూరుకుంటా మని ఈ స్మగ్లింగ్ వ్యాపారస్తులకు తెలుసు. అందుచే నీ ద్వారా ఈ సరుకు దాటించెయ్యాలని చూసింది.''

''అంత అనుమానించిన వాడివి మా హేండ్ బేగ్ మేము, ఆవిడ హేండ్ బేగ్ ఆవిడ తీసేసుకున్నాక అక్కడే ఆవిణ్ణి అరెస్ట్ చెయ్యొచ్చుకదా? బయట కెందుకు పోనిచ్చావు?'' అన్నాను.

"ఓరి చవటా! ఏమాత్రం అనుమానం కలిగినా తన చేతిలో వున్న బేగ్ తన దంటుంది కానీ, నీ చేతిలో వున్న బేగ్ తనదని ఒప్పుకోదు. దానికి నిదర్శనంగా తన చేతిలో వున్న బేగ్‌లో ఏమేమున్నాయో లిస్టు రాసిస్తుంది. పొద్దున్నే మీ గదికొచ్చి, ఆ బేగ్‌లో సామాన్లు సర్దింది ఆ మహాతల్లే కదా! అందుచే ఎగ్జిట్ దగ్గిర కాపలా వుంచి, ఆవిణ్ణి బయటకి పోనిచ్చి, తన బేగ్ తను తీసుకునే అవకాశం కల్పించేను" అన్నాడు.

వీడేకాని లేకపోతే నా చేతిలో వున్న బేగ్ చెక్ చేసి, ఆ దిక్కుమాలిన మందు పట్టుకుంటే, నేనూ, మా ఆవిడా శ్రీకృష్ణ జన్మస్థానంలో వుందుం అన్న ఆలోచన కలగ్గానే, ఒక్క క్షణం గుండె ఆగిపోయినట్టయింది. *

(యువ మాస పత్రిక)